లోక్‌సభ బరిలో 'చిరుత' హీరోయిన్?

న్యూఢిల్లీ, మార్చి 24: రామ్‌చరణ్ తొలి సినిమా చిరుత గుర్తుందా? అందులో హీరోయిన్‌గా నటించిన నటి నేహా శర్మ ఇప్పుడు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బీహార్ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం భాగల్పూర్ ఎమ్మెల్యేగా ఉన్న ఆమె తండ్రి అజిత్ శర్మ దీనిపై మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం, తాను కూడా నేహా శర్మ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని కోరుకుంటున్నామన్నారు. ఇదే విషయాన్ని ఆమె వద్ద ప్రస్తావించగా, వివిధ ప్రాజెక్టులలో బిజీగా ఉన్నానని, ఎన్నికలలో పోటీ చేసే సమయం లేదని చెప్పిందని తెలిపారు. 'ఐదారు నెలల ముందు ఈ ప్రతిపాదన తెచ్చి ఉంటే తప్పక అంగీకరించే దానిని' అని పేర్కొందన్నారు.

వీరప్పన్ కూతురికి ఎన్డీకే టికెట్

చెన్నై, మార్చి 24: గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కూతురు, న్యాయవాది వింధ్య రాణి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తమిళనాడులోని కృష్ణగిరి నియోజకవర్గం నుంచి నామ్ తమిగర్ కట్చి(ఎన్డీకే) పార్టీ తరపున ఆమె బరిలోకి దిగుతున్నారు. గతంలో బీజేపీ తమిళనాడు రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షురాలిగా ఉన్న ఆమె ఇటీవలే ఎన్డీకేలో చేరారు. ఆమె ఎన్నికల్లో పోటీ చేసే విషయాన్ని ఎన్డీకే అధ్యక్షుడు సీమన్ ఇటీవల చెన్నైలో జరిగిన బహిరంగ సభలో ప్రకటించారు. ఎన్డీకే తరపున లోక్‌సభకు పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో సగం మంది మహిళలే కావడం గమనార్హం.

మోదీ '28 పైసల ప్రధాని': ఉదయనిధి

చెన్నై, మార్చి 24: కేంద్ర నిధుల విడుదల విషయంలో తమిళనాడు పట్ల వివక్ష చూపుతున్నదంటూ మోదీ సర్కార్‌పై డీఎంకే నాయకుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ మండిపడ్డారు. పన్నుల రూపంలో కేంద్రానికి చెల్లిస్తున్న ప్రతి రూపాయిలో కేవలం 28 పైసలు మాత్రమే రాష్ట్రానికి తిరిగి వస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీని.. మనమంతా '28 పైసల పీఎం'గా పిలవాలంటూ తమిళనాడు ప్రజల్ని ఆయన కోరారు. థేనీ, రామనాథపురంలో పార్టీ ర్యాలీలో పాల్గొన్న ఆయన, మోదీ సర్కార్ తీరుపై విరుచుకుపడ్డారు. ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని మోదీ తమిళనాడుకు వస్తున్నారంటూ విమర్శించారు. 'రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులను కేంద్రం అడ్డుకుంటున్నది. ఎయిమ్స్ మదురై నిర్మాణ పనులే ఇందుకు ఉదాహరణ' అని ధ్వజమెత్తారు.

ఒక్క సీటు ఎక్కువొచ్చినా పతనమే

కోల్‌కతా, మార్చి 24: బెంగాల్‌లో అధికారంలో ఉన్న మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌పై బీజేపీ మరోసారి బెదిరింపులకు దిగింది. ప్రజాస్వామికంగా ఎన్నికైన ఆ ప్రభుత్వాన్ని కూలదోస్తామంటూ హెచ్చరికలు చేసింది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ టీఎంసీ కన్నా ఒక్క సీటు ఎక్కువ గెల్చినా మమత ప్రభుత్వం 2026 వరకు ఉండదని, పదవీకాలం పూర్తి కాకుండానే పడిపోతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ హెచ్చరించారు. ఆయన ఆదివారం పీటీఐతో మాట్లాడుతూ ఈ లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో 35 సీట్లను గెల్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ఎన్నికల్లో టీఎంసీ కన్నా ఒక్క సీటు ఎక్కువ గెల్చినా మమత ప్రభుత్వం కుప్పకూలుతుందని అన్నారు.

వామపక్షాలకు జీవన్మరణం

- దేశవ్యాప్తంగా తగ్గిన లెఫ్ట్ పార్టీల ప్రభావం
- ఉనికి కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు
- పొత్తుల కోసం లెఫ్టిస్టుల పడరాని పాట్లు
- 2009 నుంచి మొదలైన వామపక్షాల పతనం

న్యూఢిల్లీ, మార్చి 24: ఒకప్పుడు దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న లెఫ్ట్ పార్టీల పరిస్థితి నేడు దయనీయంగా మారింది. దేశ రాజకీయాల్లో ఒకనాడు చక్రం తిప్పిన పార్టీలు నేడు మనుగడ కోసం పడరాని పాట్లు పడుతున్నాయి. సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ లాంటి లెఫ్ట్ పార్టీలు క్రమంగా ప్రాబల్యాన్ని కోల్పోతున్నాయి. చివరికి సీపీఎం కూడా జాతీయ పార్టీ హోదాను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వామపక్షాలకు ఐదుగురు ఎంపీలు మాత్రమే ఉన్నారు. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికలు లెఫ్ట్ పార్టీలకు అగ్నిపరీక్షగా మారాయి. ఇందులో సత్తా చాటకపోతే వాటి మనుగడే ప్రశ్నార్థకం అయ్యే ప్రమాదం ఉన్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేరళలో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) అధికారంలో ఉన్నది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ప్రతిపక్షంగా ఉన్నది. కాంగ్రెస్, వామపక్షాలు ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ కేరళలో మాత్రం విడిగా పోటీచేస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 20 లోక్‌సభ స్థానాలు ఉండగా, గత లోక్‌సభ ఎన్నికల్లో యూడీఎఫ్ 19 స్థానాలు కైవసం చేసుకోగా, ఎల్డీఎఫ్ ఒక్కసీటుకే పరిమితమైంది.

సీతారాం ఏచూరి రాజా

ఒక్క సీటునూ గెలవని బీజేపీ కూడా ఈసారి సత్తా చాటాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. ఇక సుదీర్ఘ కాలం కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండి.. ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ కోటగా మారిన పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పార్టీ టీఎంసీ ఒంటరిగానే పోరాడుతున్నది. ఇక్కడ సీపీఐ 16 మంది అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్‌తో పొత్తు కోసం ఎదురుచూస్తున్నది. 2019 ఎన్నికల్లో సీపీఐ కేవలం ఒక్క శాతం ఓట్లను కూడా పొందలేకపోయింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఓటుబ్యాంకును మూడు శాతానికి పెంచుకుని 16 ఎమ్మెల్యే స్థానాలను వామపక్షాలు గెలుచుకున్నాయి.

15 ఏండ్ల క్రితమే పతనం ప్రారంభం

ప్రస్తుత లోక్‌సభలో సీపీఐ నుంచి ముగ్గురు, సీపీఎం నుంచి ఇద్దరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అరవై ఏండ్ల చరిత్రలో ఇంత తక్కువ సంఖ్యలో వామపక్షాల బలం ఎన్నడూ లేదు. 1990 నుంచి 2009 వరకు జాతీయ రాజకీయాల్లో లెఫ్ట్ పార్టీలు గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. 1996లో యునైటెడ్ ఫ్రంట్ హయాంలో ప్రధాని పదవి కూడా దక్కే అవకాశమొచ్చింది. 2004లో ఒక్క సీపీఎం నుంచే 43 మంది ఎంపీలు, 10 మంది సీపీఐ ఎంపీలు, ఏఐఎఫ్‌బీ, ఆర్ఎస్‌పీ తరపున ముగ్గురేసి ఎంపీలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత నుంచే వామపక్షాల ప్రభావం క్షీణించటం మొదలైంది. 2009 నుంచి 2019 మధ్య లెఫ్ట్ పార్టీల పతనం శరవేగంగా సాగింది. 2011 అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్‌లో టీఎంసీ చేతిలో, 2018లో త్రిపుర అసెంబ్లీలో బీజేపీ చేతిలో లెఫ్ట్ పార్టీలు ఓటమి చవిచూశాయి.

ప్రాంతీయపార్టీల పొత్తుతో..

కేరళ, తమిళనాడులో సిట్టింగ్ ఎంపీలున్న సీపీఎం, సీపీఐలు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నాయి. తమిళనాడులో అధికార డీఎంకేతో జతకట్టిన వామపక్షాలు కేవలం రెండేసి సీట్లలో మాత్రమే పోటీ చేస్తున్నాయి. బీహార్‌లో భారీ ఆశలే పెట్టుకున్నాయి. జార్ఖండ్‌లో జేఎంఎంతో కలిసి పోటీ చేయాలనుకుంటున్నది. చాలా రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోవటానికే తంటాలు పడుతున్నాయి. ఇక సీట్లు దక్కించుకోవడం ఆ పార్టీలకు పెద్ద సవాలే. బెంగాల్‌లో టీఎంసీ తర్వాత ప్రధాన పార్టీగా బీజేపీ అవతరించటంతో వామపక్షాల ఉనికి అక్కడ నామమాత్రంగా మారింది.

31న విపక్షాల మహార్యాలీ

- కేజ్రీవాల్ అరెస్టుపై నిరసన
- ఆప్ నేత గోపాల్‌రాయ్
- జైలు నుంచే కేజ్రీవాల్ పాలన
- తొలి ఆదేశాలు జారీ
- నీటి సమస్యపై మంత్రి ఆతిశీకి సూచనలు

కేజ్రీవాల్ నోట్‌ను చూపిస్తున్న ఆతిశీ

న్యూఢిల్లీ, మార్చి 24: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఈ నెల 31న విపక్షాలు 'మహా ర్యాలీ' నిర్వహించనున్నట్టు ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో.. దేశ ప్రయోజనాలు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇండియా కూటమి అగ్రనేతలు ఈ మహా ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. 'ఒక్క కేజ్రీవాల్ విషయమే కాదు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తప్పుడు కేసులు, దర్యాప్తు సంస్థలతో మొత్తం విపక్షాన్ని భయపెట్టేందుకు కుట్రలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మద్యం పాలసీ కేసులో రెండేండ్లుగా దర్యాప్తు చేస్తున్నా ఒక రూపాయైనా రికవరీ చేశారా? అని ప్రశ్నించారు. ఇదే మద్యం పాలసీ కేసులో అరెస్టయిన శరత్‌చంద్రా రెడ్డిని.. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇవ్వడం, ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి రూ.60 కోట్ల విరాళం అందజేయడం ద్వారా విడుదల చేశారని ఆరోపించారు.

జైలు నుంచే పాలనా ఆదేశాలు

ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచే పాలన సాగిస్తున్నారు. ఆయన తొలిసారిగా పాలనపరమైన ఆదేశాలు జారీచేశారు. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు మంచినీటి సరఫరా, మురుగు నీరు సమస్యల పరిష్కారానికి సంబంధించి ఢిల్లీ నీటి వనరుల శాఖ మంత్రి ఆతిశీకి పలు సూచనలతో కూడిన నోట్‌ను పంపించారు. తనకు సీఎం కేజ్రీవాల్ నుంచి శనివారం రాత్రి ఆదేశాలు అందాయని మంత్రి ఆతిశీ ఆదివారం వెల్లడించారు. ఆ నోట్‌ను చదువుతుంటే తనకు కండ్లలో నీళ్లు వచ్చాయని, తాను ఇబ్బందులు పడుతున్నా ప్రజా సమస్యల పరిష్కారానికి కేజ్రీవాల్ నిత్యం తపిస్తున్నారని పేర్కొన్నారు.

మహాయుతి కూటమిలో ముసలం!

ముంబై, మార్చి 24: మహారాష్ట్రలో బీజేపీ, శివసేన-షిండేవర్గం, ఎన్సీపీ-అజిత్ పవార్ వర్గంతో కూడిన 'మహాయుతి' కూటమిలో ముసలం మొదలైంది. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ లక్ష్యంగా సీఎం షిండే వర్గానికి చెందిన శివసేన నేత విజయ్ శివ్‌తారే తీవ్ర విమర్శలు చేయడంతోపాటు బారామతి లోక్‌సభ స్థానం నుంచి తాను బరిలోకి దిగుతున్నట్టు ప్రకటించడం అజిత్ పవార్ వర్గానికి ఆగ్రహం తెప్పించింది. శివ్‌తారేను పార్టీ నుంచి తొలగించకుంటే.. అధికార మహాయుతి కూటమి నుంచి వైదొలుతామని అల్టిమేటం జారీచేసింది. ఎన్సీపీ అధికార ప్రతినిధి ఉమేశ్ పాటిల్ మాట్లాడుతూ శివ్‌తారేపై చర్యలు తీసుకోవాలని ఇదివరకే షిండేను కోరామని, అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బారామతి నుంచి శరద్ పవార్ వర్గం తరపున సుప్రియా సూలే, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ నుంచి ఆయన భార్య సునేత్ర పవార్ బరిలో దిగుతున్నారు. అయితే ఈ స్థానం నుంచి తాను కూడా పోటీచేస్తానని మహాయుతి కూటమిలోని శివసేన నేత విజయ్ శివ్‌తారే ఈ నెల 12న ప్రకటించడం వివాదంగా మారింది.

బీజేపీలోకి వాయుసేన మాజీ చీఫ్ భదౌరియా

న్యూఢిల్లీ: భారత వాయు సేన (ఐఏఎఫ్) మాజీ చీఫ్ ఆర్‌కేఎస్ భదౌరియా ఆదివారం బీజేపీలో చేరారు. ఆయన ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు. ఐఏఎఫ్ చీఫ్ పదవి నుంచి 2021లో రిటైర్ అయ్యారు.

మళ్లీ బీజేపీ వైపు 'గాలి': మైనింగ్ కింగ్‌గా పేరుగాంచిన గాలి జనార్ధన్ రెడ్డి తాను తిరిగి బీజేపీలో చేరుతున్నట్టు ఆదివారం ప్రకటించారు. గతంలో బీజేపీలో ఉన్న ఆయన సొంతపార్టీ స్థాపించి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కరే నెగ్గారు.

మండి నుంచి కంగన పోటీ

111 మందితో బీజేపీ ఐదో జాబితా

న్యూఢిల్లీ, మార్చి 24: బీజేపీ ఆదివారం 111 మందితో లోక్‌సభ అభ్యర్థుల ఐదో విడత జాబితాను విడుదల చేసింది. ఆదివారమే కాంగ్రెస్ నుంచి పార్టీలో చేరిన నవీన్ జిందాల్‌కు హర్యానాలోని కురుక్షేత్ర స్థానం కేటాయించింది. బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌కు హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి, ఇటీవల కలకత్తా హైకోర్టు జడ్జిగా రాజీనామా చేసిన అభిజిత్ గంగోపాధ్యాయ్‌కు పశ్చిమబెంగాల్‌లోని తామలుక్ టికెట్లు ఇచ్చింది. ఐదో జాబితాలో బీజేపీ తెలంగాణలోని వరంగల్, ఖమ్మం స్థానాలకు వరుసగా ఆరూరి రమేశ్, తాండ్ర వినోద్ రావులను అభ్యర్థులుగా ప్రకటించింది. ఏపీలోబీజేపీ పోటీచేస్తున్న ఆరు స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించారు. కేరళలోని వయనాడ్‌లో రాహుల్ గాంధీకి పోటీగా కే సురేంద్రన్‌ను తమ పార్టీ అభ్యర్థిగా బీజేపీ ప్రకటించింది. యూపీలోని సుల్తాన్‌పూర్ నుంచి మేనకా గాంధీకి టికెట్ దక్కగా.. పిలిబిత్ స్థానంలో వరుణ్ గాంధీకి మొండిచేయి చూపింది.

టికెట్ ఇచ్చినా పోటీకి నై

- లోక్‌సభ బరిలో దిగేందుకు వెనుకాడుతున్న బీజేపీ అభ్యర్థులు
- పోటీ నుంచి తప్పుకుంటున్న పలువురు కీలక నాయకులు
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీకి కొత్త తలనొప్పులు

భికాజీ రంజన్‌బెన్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ ఎక్కడికెళ్లినా ''ఈ సారి 400కుపైనే'' అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 370 స్థానాలు, ఎన్డీయేకి 400కుపైగా స్థానాలు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు. అయితే బీజేపీ టికెట్ ఇచ్చినా, ఎన్నికల బరిలో దిగడానికి చాలా మంది ఇష్టపడటం లేదు. 'వ్యక్తిగత కారణాలు' అంటూ పోటీ నుంచి వైదొలుగుతున్నారు. సరిగ్గా పోలింగ్ దగ్గరపడుతున్న సమయంలో ఈ పరిణామాలు ఆ పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారాయి.

గుజరాత్‌లో పలువురు నేతల నిరాసక్తత..

గుజరాత్‌లోని వడోదర నుంచి పోటీ చేసేందుకు బీజేపీ టికెట్ పొందిన రంజన్‌బెన్ భట్ వ్యక్తిగత కారణాలను చూపుతూ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు శనివారం ప్రకటించారు. ఆమె రెండుసార్లు ఎంపీగా గెలిచారు. ఈసారి కూడా ఆమెకు టికెట్ దక్కడంతో ఆమె వ్యతిరేక వర్గం పెద్ద ఎత్తున పోస్టర్ల యుద్ధాన్ని ప్రారంభించింది. దీంతో ఆమె పోటీ నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నారు. తాను బీజేపీలోనే కొనసాగుతానని, అధిష్ఠానం ఎవరికి అవకాశం ఇచ్చినా, వారి విజయం కోసం కృషి చేస్తానని చెప్పారు. గుజరాత్‌లోని శబర్‌కాంత నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అవకాశం దక్కించుకున్న బీజేపీ నేత భికాజీ ఠాకూర్ కూడా కాడి కింద పడేశారు. వ్యక్తిగత కారణాలను చూపుతూ, పోటీ చేయడం తనకు ఇష్టం లేదని చెప్పారు. ఆయన మాజీ విశ్వ హిందూ పరిషత్ కార్యకర్త, ఓబీసీ నేత, 34 ఏండ్ల నుంచి బీజేపీలో ఉన్నారు. లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఆయనకు మొదటిసారి లభించింది. ఇక మెహసానా లోక్‌సభ నియోజకవర్గం నుంచి తనకు టికెట్ ఇవ్వాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ మొదట కోరారు. కానీ ఆ తర్వాత ఎటువంటి కారణం చూపకుండానే తాను పోటీ చేయబోనని ప్రకటించారు. బీజేపీ ఈ స్థానం నుంచి పోటీ చేసేవారి పేరును ప్రకటించడానికి ముందే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

- పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ లోక్‌సభ నియోజకవర్గానికి అభ్యర్థిగా భోజ్‌పురి గాయకుడు, నటుడు పవన్ సింగ్‌ను బీజేపీ ప్రకటించింది. ఈ స్థానానికి ప్రస్తుతం టీఎంసీ నేత, 'షాట్‌గన్' శత్రుఘ్న సిన్హా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే తాను అసన్‌సోల్ నుంచి పోటీ చేయలేనని పవన్ సింగ్ ప్రకటించారు.
- ఉత్తర ప్రదేశ్‌లోని బారాబంకీ నియోజకవర్గం అభ్యర్థిగా ఎంపీ ఉపేంద్ర సింగ్ రావత్‌ను బీజేపీ ప్రకటించింది. మరుక్షణంలోనే ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఓ మహిళతో అభ్యంతరకర పరిస్థితిలో ఉన్నట్లు ఈ వీడియోలో కనిపించింది. దీంతో తాను నిర్దోషినని నిరూపణ అయ్యేవరకు తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని రావత్ ప్రకటించారు.
- తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేయబోనని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ వీకే సింగ్ ఆదివారం ప్రకటించారు. ఘజియాబాద్ నుంచి రెండుసార్లు ఎన్నికైన ఆయన.. ఈ సారి పోటీలో నుంచి తప్పుకుంటున్నట్టు వెల్లడించారు. కాన్పూర్ బీజేపీ ఎంపీ సత్యదేవ్ పచౌరీ కూడా లోక్‌సభ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్టు ఆదివారం ప్రకటించారు.

ప్రచారాన్ని అడ్డుకునేందుకే సీబీఐ దాడులు

ఈసీకి మహువా ఫిర్యాదు

న్యూఢిల్లీ: సీబీఐ చర్యలు తన ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకొనేలా ఉన్నాయని తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న కాలంలో దర్యాప్తు సంస్థల సోదాలపై వెంటనే మార్గదర్శకాలను జారీ చేయాలని ఆదివారం ఆమె ఈసీకి లేఖ రాశారు. మొయిత్రా పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ స్థానం నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు.

చంద్రయాన్-3 ల్యాండింగ్ సైట్‌కు 'శివశక్తి' పేరు ఖరారు

న్యూఢిల్లీ, మార్చి 24: చంద్రయాన్-3 ప్రయోగంలో భాగంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పంపిన విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధృవంపై తొలి అడుగు మోపిన ప్రదేశాన్ని ఇకపై ప్రపంచ దేశాలన్నీ 'శివశక్తి' పాయింట్‌గానే పిలువనున్నాయి. ఇంటర్నేషనల్ ఆస్ట్రోనామికల్ యూనియన్ (ఐఏయూ) ఆమోదంతో ఈ పేరుకు ప్రధాని మోదీ ప్రకటించిన 7 నెలల తర్వాత ఆమోదంలభించింది. చంద్రయాన్-3 ల్యాండింగ్ సైట్‌కు అధికారికంగా 'శివశక్తి' పాయింట్ అని పేరు పెట్టేందుకు పారిస్‌లోని ఐఏయూ ఈ నెల 19న ఆమోదం తెలిపినట్టు ప్లానెటరీ నామినేక్లేచర్ గెజిట్ వెల్లడించింది.

ఏడేండ్ల కనిష్ఠానికి గోధుమ నిల్వలు

న్యూఢిల్లీ, మార్చి 24: దేశంలో గోధుమల కొరత ఏర్పడుతున్నది. పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదంటే కేంద్రం వద్ద ఉన్న గోధుమల నిల్వలు ఏడేండ్ల కనిష్ఠానికి పడిపోయాయి. 2023 మార్చి 1 నాటికి కేంద్రం వద్ద నిల్వలు 11.67 మిలియన్ టన్నులు ఉండగా, ప్రస్తుతం 9.7 మిలియన్ టన్నులకు తగ్గాయి. చివరగా 2017లో గోధుమల నిల్వలు 9.42 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. కనీస మద్దతు ధర ఇవ్వటంలో కేంద్రం విఫలం కావటం వల్లే రైతులు తమ పంటను ప్రైవేట్ వ్యాపారులకు అమ్మడంతో ప్రభుత్వ సేకరణ కోటా లక్ష్యం నెరవేరలేదని విశ్లేషకులు చెప్తున్నారు.

జేఎన్‌యూ ఎన్నికల్లో లెఫ్ట్ హవా

న్యూఢిల్లీ, మార్చి 24: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (జేఎన్‌యూఎస్‌యూ) 2024 ఎన్నికల్లో వామపక్ష విద్యార్థి సంఘం అభ్యర్థులు మరోమారు తమ ఆధిపత్యాన్ని చాటారు. జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షుడిగా లెఫ్ట్ అభ్యర్థి ధనుంజయ్ విజయం సాధించారు. ఏబీవీపీ అభ్యర్థి ఉమేశ్ చంద్రపై ఆయన గెలుపొందారు. అధ్యక్ష సహా ఉపాధ్యక్ష, జనరల్ సెక్రెటరీ, జాయింట్ సెక్రెటరీ పదవులన్నీ లెఫ్ట్ అభ్యర్థులు తిరిగి నిలబెట్టుకున్నారు. నాలుగేండ్ల తర్వాత జరిగిన జేఎన్‌యూఎస్‌యూ-2024 ఎన్నికల ఫలితాలు ఆదివారం రాత్రి వెలువడ్డాయి. ఈ స్టూడెంట్స్ ఎన్నికల్లో దాదాపు 7 వేలమందికిపైగా విద్యార్థులు ఓటేశారు.

ఐసిస్‌తో సంబంధాలున్న ఐఐటీ విద్యార్థి అరెస్ట్

గువాహటి, మార్చి 24: ఉగ్రవాద సంస్థ ఐసిస్‌లో చేరుతానంటూ కనిపించకుండా పోయిన ఐఐటీ గువాహటి స్టూడెంట్‌ను అస్సాం స్పెషల్ టాస్క్ ఫోర్స్ బలగాలు అరెస్టు చేశాయి. సదరు విద్యార్థికి ఐసిస్‌తో సంబంధాలు ఉన్నట్టు కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయని పోలీస్ అధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. ఐఐటీ-గువాహటి క్యాంపస్‌లో నాలుగో ఏడాది బయో టెక్నాలజీ చదువుతున్న విద్యార్థి తౌసీఫ్ అలీ ఫారూకీని అరెస్టు చేసినట్టు ఎస్‌టీఎఫ్ ఐజీ పార్థసారథి మహంతా మీడియాకు తెలిపారు. నిందితుడిపై ఐపీసీలోని వివిధ సెక్షన్లు, ఉపా కింద కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

బ్రెయిన్ చిప్ సాయంతో ట్వీట్!

న్యూఢిల్లీ, మార్చి 24: 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్‌కు చెందిన న్యూరాలింక్ కంపెనీ ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. పక్షవాత రోగి నొలండ్ అర్బాగ్ తన మెదడులోని చిప్ సాయంతో మొదటిసారిగా ట్వీట్ చేశారు. తన ఆలోచనలు, న్యూరాలింక్ సైబర్‌నెటిక్ ఇంప్లాంట్ సాయంతో తాను ఈ పని చేశానని ఆయన చెప్పారు. 'నన్ను రోబో అనుకొని ట్విట్టర్(ఎక్స్‌కు గతంలోని పేరు) నన్ను నిషేధించింది. కానీ ఎక్స్, ఎలాన్ మస్క్ తిరిగి నా ఖాతా పునరుద్ధరించారు' అని ఆయన ట్వీట్ చేశారు. 'న్యూరాలింక్ టెలీపతి పరికరాన్ని ఉపయోగించి, కేవలం ఆలోచనల ద్వారా చేసిన మొట్టమొదటి పోస్ట్' అని అర్బాగ్ ట్వీట్‌కు మస్క్ స్పందించారు. ఇటీవలే అర్బాగ్ బ్రెయిన్ చిప్ సాయంతో వీడియో గేమ్స్ ఆడారు.

రంగులు మెరిసె.. నవ్వులు విరిసె

దేశవ్యాప్తంగా ఒక రోజు ముందే హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం పశ్చిమ బెంగాల్‌లోని బాలుర్‌ఘాట్‌లో యువతులు ఇలా ఉత్సాహంగా రంగులు చల్లుకున్నారు.

			26.Crime No: 243/2017 PS Nandigama, Ranga Reddy District Hon'ble Prl.J.F.C.M Shadnagar	U/S 341,506 r/w 34 IPC Wrongfully restraining any person, criminal intimidation			
			27.Crime No:232/2017 PS Nandigama, Ranga Reddy District Hon'ble Prl.J.F.C.M Shadnagar	U/S 420 IPC Cheating			
			28.Crime No:103/2016 PS Kothur now at PS Nandigama, Ranga Reddy District Hon'ble Prl.J.F.C.M Shadnagar	U/S 447, 427, 504, 506 r/w 109 IPC Criminal trespass, mischief, insult intended to provoke breach of the peace, criminal intimidation			
			29.Crime No:50/2016 PS Kothur now at PS Nandigama, Ranga Reddy District Hon'ble Prl.J.F.C.M Shadnagar	U/S 447, 323, 506 r/w 34 IPC Mischief, voluntarily causing hurt, criminal intimidation			
			30.128/2012 PS Kothur now at PS Nandigama, Ranga Reddy District Hon'ble Prl.J.F.C.M Shadnagar	U/S 447,427 IPC Criminal trespass mischief.			

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of Constituency.

Sd/- Signature of the officer bearer of the Political Party
Name and Designation : **SOMA BHARATH KUMAR**
: **GENERAL SECRETARY**
Bharat Rashtra Samithi
Telangana Bhavan, Road No: 10,
Banjara Hills, Hyderabad-500034